క్లుప్తంగా

బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు



పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ భవ్య రెడ్డి

రామభద్రపురం: ఐపీఎల్ జరుగుతున్నందున క్రికెట్ బెట్టింగ్‌లు జరిగే అవకాశం ఉందని, ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ భవ్య రెడ్డి హెచ్చరించారు. మండలంలోని కొట్టక్కి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును ఆమె సోమవారం తనిఖీ చేశారు. సులభంగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో కొంతమంది అప్పులు చేసి మరీ వాటితో బెట్టింగ్‌లు కడుతున్నారని, ఆ తర్వాత నష్టపోయి ఆర్థికంగా చితికిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల రవాణా, బెట్టింగ్‌లు జరగకుండా గట్టి నిఘా పెడుతున్నామన్నారు.

హౌసింగ్ కార్యాలయానికి తాళం



హౌసింగ్ కార్యాలయానికి తాళం వేసి ఉండడాన్ని చూపిస్తున్న సీపీఎం మండల కార్యదర్శి సురేష్

బాడంగి: స్థానిక హౌసింగ్ కార్యాలయానికి సోమవారం ఉదయం తాళం వేసి ఉంది. హౌసింగ్ శాఖలో జరుగుతున్న పలు అవకతవకలపై అధికారులు పట్టించుకోకపోవడాన్ని ప్రశ్నించేందుకు సీపీఎం మండల కార్యదర్శి ఎ.సురేష్ కార్యాలయానికి వెళ్లగా, తాళం వేసి ఉండడాన్ని చూసి ఆశ్చర్యపోయారు. అధికారులు విధులకు డుమ్మా కొట్టి వెళ్లిపోవడాన్ని ఆయన విమర్శించారు. ఇలా విధులకు హాజరుకాని వారిపై చర్యలు తీసుకోరా అని ఉన్నతాధికారులను నిలదీశారు.

వినతిపత్రం అందజేత



ఎమ్మెల్యే బేబీనాయనకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

బొబ్బిలి: పాఠశాలలు తరలించవద్దని కోరుతూ యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు కె.విజయగౌరి.. ఆ సంఘ నాయకులతో కలిసి ఎమ్మెల్యే బేబీనాయనకు వినతిపత్రం అందజేశారు. స్థానిక కోటలో ఉన్న ఎమ్మెల్యే వద్దకు వారు సోమవారం వెళ్లి, తక్కువ విద్యార్థులున్న యూపీ పాఠశాలలను వాటికి సమీపంలోని ఉన్నత పాఠశాలలకు తరలించడం వల్ల కలిగే నష్టాలను ఎమ్మెల్యేకు వివరించారు. పాఠశాలల విలీనం వల్ల విద్యార్థులకు వ్యయప్రయాసలు ఎక్కువవుతాయని, తద్వారా విద్యార్థులు చదువుకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వానికి ఈ విషయం తెలియజేసి, పాఠశాలల విలీనం ఆపాలని విజ్ఞప్తి చేశారు.

ఫారంపాండ్‌లు ప్రారంభం



ఫారంపాండ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

రాజాం: ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా మండలంలోని ఒమ్మి గ్రామ తోటల్లో తయారు చేసిన ఫారంపాండ్‌లను ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సోమవారం ప్రారంభించారు. భూగర్భజలాల సంరక్షణకు ఈ ఫారంపాండ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని, అలాగే ఈ ఫారంపాండ్‌ల నిర్మాణ పనుల ద్వారా ఆదాయం కూడా వస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీవో సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణ

రేగిడి: మండలంలోని పసనలవలస గ్రామంలో పాడైన తాగునీటి బోర్లు బాగుచేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో మరమ్మతులకు గురైన తాగునీటి వనరులను క్రాస్‌ప్రోగ్రాంలో భాగంగా బాగు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

వంగర: మండలంలోని చినరాజులగుమ్మడ, పెదరాజులగుమ్మడ గ్రామాల్లో తాగునీటి బోర్ల మరమ్మతులు సోమవారం చేపట్టారు. ఆయా గ్రామాల్లో పాడైన నాలుగు బోర్లు బాగు చేసి, తాగునీటిని అందించారు.

బెల్లం వ్యాపారులపై బైండోవర్ కేసులు

బొబ్బిలిరూరల్: బెల్లం వ్యాపారులపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దారు ఎం.శ్రీను వద్ద రూ.లక్ష పూచీకత్తుపై వ్యాపారులను బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. సారా తయారీకి బెల్లం విక్రయించకుండా వ్యాపారులపై ఈ విధమైన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.



ఉపాధి హామీ పనుల్లో వేతనదారులు (ఫైల్)

- కలగా వ్యవసాయానికి ఉపాధి పనుల అనుసంధానం
- రైతాంగాన్ని వేధిస్తోన్న కూలీల కొరత
- వేతనదారులుగా వ్యవసాయ కూలీలే ఉండడంతో దుస్థితి
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు

వ్యవసాయానికి ఉపాధి పనులు అనుసంధానం చేయాలని రైతు విజ్ఞప్తి



ఉపాధి, వ్యవసాయం.. అనుసంధానమెప్పుడో?

రామభద్రపురం: వ్యవసాయ రంగానికి ఉపాధి హామీ పథకం పనుల అనుసంధానం ఓ కలగా మిగిలిపోతోంది. ఉపాధి పనులకు వెళ్తున్న వారంతా వ్యవసాయ కూలీలే కావడంతో సాగు పనులకు కూలీల కొరత ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో అటు రైతాంగానికి, ఇటు ఉపాధి వేతనదారులకు లబ్ధి కలిగేలా ప్రభుత్వాలు ఆలోచన చేశాయి. వ్యవసాయ పనులను ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద చేస్తే ఇరువురికీ న్యాయం చేసినట్లు అవుతుందని భావించాయి. అయితే ఆ ప్రక్రియ కార్యాచరణకు నోచుకోకపోవడం గమనార్హం. జిల్లాలోని 27 మండలాల్లో 3.10 లక్షల ఉపాధి పనుల జాబ్‌కార్డులు ఉండగా, వాటిలో 2.40 లక్షల మంది కూలీలుగా నమోదై ఉన్నారు. వీరిలో ప్రతిరోజూ 70 వేల మంది పనులకు వెళ్తున్నారు.



వ్యవసాయానికి ఉపాధి పనులు అనుసంధానం చేయాలని డిమాండ్ చేస్తున్న నాయుడువలస గ్రామ రైతులు

యాంత్రీకరణ వచ్చినా..

వ్యవసాయంలో యాంత్రీకరణ వచ్చినా చాలా పనులు కూలీల ద్వారానే చేయాల్సి వస్తోంది. ఫలితంగా కూలీలను వెతికిపట్టుకోవడం రైతులకు తలనొప్పిగా మారింది. ఎవరిని పిలిచినా వ్యవసాయ పనుల కన్నా ఉపాధి పనులే బెటర్ అని, రెండు గంటల పాటు చేసే సులువైన పనితో గిట్టుబాటు అయ్యే కూలీ వస్తోందని అంటున్నారు. ఈ నేపథ్యంలో సేద్యానికి ఉపాధి పనులు జోడిస్తే రైతులకు కూలీల భారం తప్పుతుందని అంతా భావిస్తున్నారు. 2014లో అప్పట్లో అధికారంలోని టీడీపీ ప్రభుత్వమే ఉపాధి పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తామని చెప్పిందని, ఇప్పుడు కూడా అదే ప్రభుత్వం(కూటమి ప్రభుత్వంలో భాగస్వామి) అధికారంలో ఉండడంతో మళ్లీ వ్యవసాయానికి ఉపాధి పనుల అనుసంధానం చేయాలన్న ప్రతిపాదన రైతుల నుంచి వస్తోంది.

అప్పుల పాలవుతున్నాం..



రైతులకు పంటల సాగు భారంగా మారింది. వ్యవసాయంపై పెట్టిన పెట్టుబడులు కూడా ఒక్కోసారి దక్కడం లేదు. పెట్టిన ఖర్చులు కూడా రాకపోగా అప్పులే మిగులుతున్నాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించాలి. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి న్యాయం చేయాలి.

– పూడి సత్యం, రైతు

రైతు కష్టాలు గుర్తించాలి..



ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించి, ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి. కూలీల కొరత తీరేలా చూడాలి. వ్యవసాయం కష్టమైన వేళ వేతనదారులను సాగు పనులకు పంపిస్తే ఎంతో కొంత మంచి జరిగి నష్టపోకుండా ఉండగలుగుతాం. లేకుంటే ఎప్పటిలాగా నష్టాలు చవిచూడాలి.

– చింతల సింహాచలంనాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్

రైతులకు ప్రయోజనం..



ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగాన్ని ఒక్కటి చేస్తే రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో పంటల సాగు భారమైంది. అప్పులు చేసి మరీ పెట్టుబడులు పెట్టినా పంటలు పండడం లేదు. ఒక్కోసారి వచ్చిన దిగుబడులు కూడా అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలి. ఎలాగో ఒకలా వారికి మేలు చేసే కార్యక్రమం చేపట్టాలి.

– చొక్కాపు లక్ష్మణరావు, ఎంపీపీ, రామభద్రపురం

చర్చి భూముల విక్రయం అక్రమమే..

రాజాం సిటీ: మండలంలోని గడిముడిదాం గ్రామంలో ఉన్న ఆర్‌సీఎం చర్చి భూములు విక్రయం అక్రమమేనని ఫాదర్‌లు అల్లం విజయ్‌రెడ్డి, బోగి బాల పుష్పరాజ్, దూసి దేవరాజ్‌లు స్పష్టం చేశారు. అప్పటి ఫాదర్ నున్నం ప్రసాదరావు గ్రామంలోని చర్చికి సంబంధించిన 37.16 ఎకరాల భూమిని అక్రమంగా అమ్మేశారని పేర్కొన్నారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలోని ఆర్‌సీఎం చర్చి వద్ద సోమవారం మీడియా సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఆర్‌సీఎం చర్చికి సంబంధించిన ఆస్తులు ఉమ్మడి ఆస్తులని, వాటిపై ఏ ఒక్కరికీ విక్రయించే హక్కు లేదన్నారు. శ్రీకాకుళం మేత్రాసనానికి చెందిన గడిముడిదాం చర్చి గ్రామంలో సర్వే నంబరు 392/1బిలో 21.61 ఎకరాలు, 392/3లో 15.55 ఎకరాల భూములు నిరుపేద ప్రజల జీవనోపాధికి కేటాయించడం జరిగిందన్నారు. అయితే ఇవే భూములను అప్పట్లో ఫాదర్‌గా ఉన్న నున్నం ప్రసాదరావు ఆ భూములు అనుభవిస్తున్న వారిని మభ్యపెట్టి, దౌర్జన్యంగా వారి నుంచి ఆ భూములు లాక్కుని వాటిని ఆయన పేరిట మార్చుకున్నారన్నారు. ఇదే చర్చి పేరు మీద సెయింట్ థెరీసా ఆర్‌సీఎం చర్చి పేరు మీదనా భూములు విక్రయించారన్నారు. ఈ విషయంపై హైకోర్టులో కేసు ఉందని, కోర్టు ఉత్తర్వుల మేరకు జేసీ కూడా ఈ నెల 29వ తేదీన ఏర్పాటు చేయబోయే సమావేశానికి ఇరుపార్టీలు హాజరు కావాలని నోటీసులు కూడా జారీ చేశారన్నారు. ఈ సమావేశానికి హాజరయ్యేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఈలోగా కోర్టు పరిధిలోని ఆ భూమిని ఈ నెల 12వ తేదీన విశాఖపట్నం జిల్లా, కశింకోట మండలం, ఎదురుపర్తి గ్రామానికి చెందిన అల్లవరపు సన్యాసినాయుడు, అల్లవరపు మేరీరత్నంల పేరిట విశాఖపట్నంలో రిజిస్ట్రేషన్ చేశారన్నారు. కోర్టులో కేసు ఉంటుండగా ఇలా చేయడం తప్పు కాదా? కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడమే కదా అని అన్నారు. భూ అక్రమాలకు పాల్పడిన ఫాదర్‌ను కూడా తొలగించడం జరిగిందన్నారు. ఏది ఏమైనా ప్రజలకు, రైతులకు న్యాయం జరగాలని ఆర్‌సీఎం చర్చి తరఫున కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ఫాదర్లు తుమ్మా దోమినిక్, యజ్జల ఐసాక్, కొమ్మారెడ్డి తోమాస్, పసల జయపాల్, పెద్దింటి సుందరరావు, గుంట మరియదాస్, నిద్దాన జేమ్స్, ధన్నాన ఆల్ఫోన్స్ పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఫాదర్‌లు దేవరాజ్, విజయ్‌రెడ్డి, బాలపుష్పరాజ్

పీ4 సర్వేపై గ్రామసభ

బొబ్బిలి: మండలంలోని జగన్నాథపురంలో పీ4 సర్వేపై సోమవారం గ్రామసభ నిర్వహించారు. సర్వేలో సేకరించిన పేదల వివరాలపై చర్చించిన అనంతరం గ్రామాభివృద్ధికి సంబంధించిన వివిధ పనులపై సభ్యులు తీర్మానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి బొద్దల సత్యనారాయణ, ఎంపీటీసీ రౌతు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎక్కలదేవతమ్మ పండగ

రాజాం: మండలంలోని పాగిరి గ్రామంలో మంగళవారం నుంచి ఎక్కలదేవతమ్మ పండగ జరగనుంది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ పండగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 25న అమ్మవారికి ముర్రాటల సమర్పణ, 26న తిరువీధి మహోత్సవం, 27న అమ్మవారికి ప్రత్యేక పూజలు, మొక్కుల చెల్లింపులు 28న అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్తలు పేర్కొన్నారు. ప్రతి ఐదారేళ్లకోసారి జరిగే ఈ పండగను రాజకీయ పార్టీలకు అతీతంగా ఎంతో వైభవంగా జరుపుకుంటుండడం విశేషం.

సంక్షిప్తంగా...

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

తెర్లాం: ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దారు జి.హేమంత్‌కుమార్ అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మండలంలోని వెంకటాపురం నుంచి రైతు వచ్చి, తన తండ్రి రామినాయుడుకు రెండు ఖాతా నంబర్లు ఉన్నాయని, వాటిని ఒకే ఖాతాకు మార్చి వన్-బి వచ్చేలా చూడాలని కోరారు. ఎంపీడీవో రాంబాబు పాల్గొన్నారు.

కార్మికుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలి

రాజాం: కార్మికుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కొండలరావు సూచించారు. స్థానిక పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న వాణిజ్య సంస్థలను ఆయన సోమవారం సందర్శించారు. అక్కడ పనిచేసే కార్మికులకు కల్పిస్తున్న మౌలిక వసతులు, రక్షణ చర్యలపై ఆరాతీశారు. కార్మికుల ప్రాణానికి ప్రమాదం లేకుండా చర్యలు చేపట్టాలని, ప్రస్తుతం వేసవి ఎండల నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా చూడాలన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 17 మంది ఎంపిక

తెర్లాం: మండలంలోని పెరుమాళి పీహెచ్‌సీలో సోమవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న 17 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు వైద్యాధికారి వెంకటేష్, ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు తెలిపారు. శస్త్రచికిత్స కోసం వారిని విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించనున్నామన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

బాడంగి: వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ డీఎస్ శేఖరరావు తెలిపారు. ఇదే విషయమై ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా మండలంలో మొత్తం 52 కుళాయి నిర్మాణ పనులు మంజూరయ్యాయని, వాటిలో 33 పూర్తయ్యాయన్నారు. మిగిలినవి రద్దు అయ్యాయన్నారు. పాల్తేరు వేగావతి నది ద్వారా మొత్తం 18 గ్రామాలకు తాగునీరు అందుతోందన్నారు.

నేటి నుంచి ఉచిత యోగా తరగతులు

రాజాం సిటీ: స్థానిక పట్టణంలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని యోగా గురువు టీటీవీ రమణమూర్తి ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. అమ్మవారి కాలనీ వద్ద దేవీ శ్రీదేవి కల్యాణ మండపంలో ఉదయం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు పది రోజుల పాటు జరగనున్నాయన్నారు. ఈ అవకాశాన్ని ఔత్సాహికులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిధుల మంజూరు తర్వాతే నిర్మాణం

బొబ్బిలి: నిధులు మంజూరైన తర్వాతనే మండల కేంద్రంలో నావల్ సైన్స్ టెక్నాలజీ పార్కు సహా పైలట్‌ల శిక్షణా కేంద్రం నిర్మాణం జరుతుందని ఆర్డీవో జేవీవీఎస్ రామ్మోహనరావు తెలిపారు. ఇదే విషయమై ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఆయా నిర్మాణాల కోసం ముగడ, కోడూరు, రామచంద్రపురం, మల్లంపేట, పాల్తేరు, పూడివలస గ్రామాలకు చెందిన రైతుల నుంచి భూముల సేకరణ చేయాల్సి ఉందన్నారు. నిర్మాణాలకు సంబంధించిన బడ్జెట్ కోసం తొలుత నావికాదళం అధికారులకు, ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేయడం జరుగుతుందన్నారు.

వ్యక్తికి గాయాలు

సంతకవిటి: జేసీబీ బకెట్ తగిలి మండలంలోని సిరిపురానికి చెందిన పాగిరి నారాయణరావు(38)కు గాయాలైనట్లు ఏఎస్ఐ ఎం.వాసుదేవరావు సోమవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. నారాయణరావు ట్రాక్టరు డ్రైవర్‌గా పాగిరి అప్పలనాయుడు వద్ద పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం పొలాల్లో మట్టిని తీసేందుకు నాలుగు ట్రాక్టర్లు, ఓ జేసీబీని వినియోగించారు. అక్కులు గారి పొలంలోని రాయిని నెట్టుటకు ట్రాక్టరు ఆపి నారాయణరావు రాయిని తీస్తుండగా దానిని గమనించని జేసీబీ డ్రైవరు జేసీబీని ముందుకు పోనిచ్చాడు. దీంతో ఆ జేసీబీ బకెట్ నారాయణరావుకు బలంగా తగలడంతో వెన్నెముక, ఛాతికి బలంగా దెబ్బలు తగలాయి. 108 అంబులెన్స్‌లో ఆయనను చికిత్స నిమిత్తం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్ఐ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయోత్పత్తులతో ఆరోగ్యం

తెర్లాం: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే కూరగాయలు(ప్రకృతి వ్యవసాయోత్పత్తులు) తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని ఎంపీడీవో రేగి.రాంబాబు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రకృతి సాగు ద్వారా పండించిన కూరగాయల విక్రయాలు సోమవారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎటువంటి రసాయన ఎరువులు వినియోగించకుండా కేవలం జీవామృతం, పలుపత్ర ద్రావణం ద్వారా పండిస్తున్న కూరగాయలు తినడం ఎంతో మంచిదన్నారు.

ఎన్నాళ్లీ 'దారి'ద్ర్యం..?



రేగిడి మండలంలోని రహదారులు అధ్వానంగా ఉన్నాయి. గ్రామీణ రోడ్లు అయితే మరీ దారుణం. ధ్వంసమైన రోడ్లు.. రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలతో అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఏ చిన్నపాటి వర్షం కురిసినా ఏది గొయ్యి.. ఏది సమతలం అనేది వెళ్లే దారిలో గుర్తించడం కష్టం. ప్రయాణికులు, వాహన చోదకులంతా ఎన్నాళ్లీ దరిద్రమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రంలోని సోమరాజుపేట రోడ్డు మాదిరే మండల వ్యాప్తంగా రోడ్ల పరిస్థితి ఉంది. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా గ్రామాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు శూన్యమని పలువురు విమర్శిస్తున్నారు. – రేగిడి

రోడ్డుపైనే మురుగు..



రామభద్రపురం చేపల మార్కెట్, ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయం ప్రాంతాల్లో రోడ్లపైనే మురుగునీరు ప్రవహిస్తోంది. ఏ చిన్నపాటి వర్షం కురిసినా పూడికలతో నిండిపోయిన కాలువల్లోని మురుగు అంతా రోడ్లు మీదికి వచ్చేస్తోంది. ఈ మురుగు వల్ల దుర్వాసనతో విపరీతంగా దోమలు పెరిగి కుడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డును ఆనుకుని ఉంటున్న దుకాణదారులు, పలు ఇళ్ల యజమానులు డ్రైనేజీలను ఆక్రమించుకోవడంతోనే ఈ దుస్థితి నెలకొందంటున్నారు. ఈ చిత్రంలోనిది చేపల మార్కెట్ వద్ద రోడ్డు మీదుగా పారుతున్న మురుగు. – రామభద్రపురం

రాస్తారోకో



కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వాహనదారులు బొబ్బిలి చర్చి సెంటర్ వద్ద సోమవారం రాస్తారోకో చేపట్టారు. ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు సీఐటీయూ(సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్రానికి వ్యతిరేకంగా ఆందోళనకారులు నినాదాలు చేశారు. కేంద్రం తీసుకువస్తున్న వాహన చట్టాలు వాహనదారుల మెడకు ఉరితాడులా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఐపీసీ 304(ఎ) సెక్షన్ మార్పులు ఆపాలని, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల ప్రైవేటీకరణ ప్రక్రియ నిలుపుదల చేయాలని, వాహనదారులపై పెంచిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల భారం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. – బొబ్బిలి

ప్రతి గ్రామంలో 'ఉపాధి' పనులు జరగాలి

రేగిడి: ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులు జరగాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఏపీవో ఎస్.హరనాథ్ సూచించారు. స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సోమవారం సమావేశమైన ఆయన.. గ్రామాల్లో గుర్తించిన పనులను చేయించాలని, జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పనులు కల్పించాలని తెలిపారు.

రాజాం సిటీ: మండలంలోని అంతకాపల్లి అయ్యప్ప చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సోమవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. రోజుకు రెండు పూటలా పనులు చేయాలని, నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం

తెర్లాం: నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని, ప్రతి రైతు నవధాన్యాలు సాగు చేయాలని వెలుగు ఏపీఎం టి.రాము, ఏపీ సీఎస్ఎఫ్ యూనిట్ ఇన్‌చార్జ్ తులసి అన్నారు. మండలంలోని అరసబలగ గ్రామంలో నవధాన్యాల సాగు-దాని ప్రయోజనాలపై సోమవారం అవగాహన కల్పించారు. నవధాన్యాలు సాగు చేసుకోవడం ద్వారా భూసారం పెరగడంతో పాటు వాటి విత్తనాలు విక్రయించడం ద్వారా ఆదాయం పొందవచ్చన్నారు.

వంగర: మండలంలోని పాతమరువాడ గ్రామంలో సరిహద్దు పంటలపై సోమవారం అవగాహన కల్పించారు. మొక్క జొన్న పంటకు సరిహద్దు పంటగా తెల్లజొన్న వేసుకోవాలని, వేరుశనగ, కూరగాయలు సాగుచేసే పొలాల్లో సాధారణ మొక్కజొన్నను సరిహద్దు పంటగా వేసుకుంటే అదనపు ఆదాయం లభిస్తుందన్నారు.

జీడిమామిడిలో సస్యరక్షణ తప్పనిసరి

సంతకవిటి: జీడిమామిడి తోటల్లో పంటకు పట్టే చీడపీడలు, తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టడం తప్పనిసరి అని మండల ఉద్యానవన శాఖాధికారి సీహెచ్ ఉమామహేశ్వరి, శాస్త్రవేత్త వి.హరికుమార్‌లు అన్నారు. సోమవారం మండలంలోని జీఎస్ పురంలో రైతులకు అవగాహన కల్పించారు. పూత, పిందె బాగుండాలన్నా.. మామిడికాయలు, జీడిపిక్కలు నాణ్యంగా ఉండాలన్నా వ్యవసాయ, ఉద్యానవన అధికారులు సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ఫ్రూట్‌కవర్లు వాడడం ద్వారా మామిడికాయలు నాణ్యమైనవి చేతికి అందివస్తాయన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ



రాజాం: ర్యాలీలో బొద్దాం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది



రేగిడి: బూరాడ పీహెచ్‌సీ వద్ద ర్యాలీకి సిద్ధమైన సిబ్బంది

రాజాం: మండలంలోని బొద్దాం గ్రామంలో క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ సోమవారం చేపట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సిద్ధీశ్వరి తదితరులు వ్యాధి లక్షణాలు, వ్యాధి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎవరైనా వ్యాధి లక్షణాలతో బాధపడితే తక్షణమే ఆస్పత్రిని సంప్రదించాలని కోరారు. ఎడతెరిపిలేని దగ్గు ఉంటే వెంటనే కెల్ల పరీక్ష చేయించుకోవాలని, వ్యాధి నిర్ధారణ అయితే వ్యాధిగ్రస్తులకు ఆరు నెలలకు సరిపడ మందులు ఉచితంగా అందివ్వడంతో పాటు ప్రతినెలా రూ.వెయ్యి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. టీబీ ముక్త భారత్ అభియాన్ కింద వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కూడా అందజేయడం జరుగుతుందన్నారు.

రేగిడి: ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినంలో భాగంగా మండలంలోని బూరాడలో క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వైద్యులు ఎస్.చలమయ్య, రీనాచౌదరి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాడంగి: మండల కేంద్రంలో క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ సోమవారం చేపట్టారు. కార్యక్రమంలో వైద్యురాలు ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.